కానిస్టేబుల్ అభ్యర్థుల పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ

చైర్మన్ గిరి ఎవరికో..?

- బిసి మైనార్టీ మహిళకు రిజర్వేషన్
- ముమ్మర ప్రయత్నాల్లో కూటమి నేతలు

రాయలసీమలోనే అతిపెద్ద మార్కెట్ యార్డ్‌గా ఆదోని మార్కెట్ యార్డుకు పేరుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నామినేటెడ్ పదవుల భర్తీ ప్రారంభించి మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్‌లు ప్రకటించింది. ఆదోని మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ పదవిని బిసి మైనార్టీ మహిళలకు కేటాయించింది. ఇప్పటి వరకు చైర్మన్ పోస్టును మహిళలకు ఏ ప్రభుత్వం కూడా కేటాయించలేదు. అయితే ఈసారి మాత్రం బిసి మైనార్టీ మహిళకు పదవిని రిజర్వేషన్ ఖరారు చేసింది. దీంతో కూటమి నేతలు చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆదోని మార్కెట్ యార్డు

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

ఆదోని నియోజకవర్గ కూటమి నేతలు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిని తమకు అనుకూలమైన అభ్యర్థిగానికి వచ్చేలా ప్రయత్నాలు ముమ్మరంగా చేపడుతున్నారు. చైర్మన్ పోస్ట్ కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్న ఓసీ వర్గాలకు చెందిన టిడిపి, కూటమి నేతలకు మాత్రం నిరాశే ఎదురయింది. ప్రధానంగా ఫుడ్ కమిషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లప్ప సతీమణి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు నమ్మిన బంటుగా పేరుగాంచిన ఆరెకల్ రామకృష్ణ భార్య ధనలక్ష్మి పేర్లను తెరపైకి వస్తున్నాయి. మరోవైపు ఆదోని పెద్ద మసీదు నిర్వహణ కమిటీ చైర్మన్ సౌదీ రౌఫూఫ్ మార్కెట్ యార్డ్ చైర్మన్ గిరి సాధించడానికి ఇప్పటికే ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆదోని ఎమ్మెల్యే టికెట్ రేసులో సౌదీ రౌఫ్ తనవంతుగా రాష్ట్రస్థాయిలో టిడిపి అధిష్టానం వద్ద ప్రయత్నాలు చేశారు. అయితే కూటమిలో భాగంగా టికెట్ బిజెపికి కేటాయించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు అవకాశం వచ్చినా సౌదీ రౌఫ్ ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. గత జగన్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పై తీవ్రస్థాయిలో వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ చమటలు పట్టించిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఉమ్మి సలీం కుటుంబానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ గిరి దక్కడం ఖాయమని పట్టణంలోని కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. టిడిపిలో ఒక గ్రూపుగా ఏర్పడి పార్టీ ఏ కార్యక్రమాలు పిలుపునిచ్చినా విజయవంతం చేస్తూ దూసుకుపోతున్న గుడిసె కిష్టమ్మకు చైర్మన్ పదవి దక్కుతుందని కార్యకర్తలు ఆశపడుతున్నారు. మరో వైపు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు నమ్మిన బంటుగా పేరున్న ఆరెకల్ రామకృష్ణ భార్య ఆరెకల్ మాజీ సర్పంచ్ ధనలక్ష్మి పేరు కూడా వినిపిస్తుంది. టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అప్సర్ బాషా, ఎల్‌బిసి ఏజెంట్ అన్సర్, హానవాల్ గ్రామం మాజీ సర్పంచ్ మహబూబ్ బాషాలు కూడా చైర్మన్ గిరి కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మార్కెట్ యార్డ్ చైర్మన్ పోస్ట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న బీసీ సెల్ జిల్లా నాయకులు వాల్మీకి ఆరెకల్ రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గోనేహాల్ గోపాల్ రెడ్డి, బుద్దారెడ్డి, పెద్దహరివనం శేషిరెడ్డిలతోపాటు మరికొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆదోని మార్కెట్ యార్డ్ చైర్మన్ పోస్టు ఎవరిని వరిస్తోందని పట్టణంలో ఎక్కడ చూసినా చర్చ నడుస్తోంది.

ముగిసిన దేహదారుడ్య పరీక్షలు

- కానిస్టేబుల్ మెయిన్ పరీక్షకు అర్హత సాధించిన 204 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పోలీస్ నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఎపిఎస్‌పి రెండవ బెటాలియన్‌లో 3వ రోజు గురువారం దేహదారుడ్య పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ దేహదారుడ్య సామర్థ్య పరీక్షలను కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ దగ్గరుండి పర్యవేక్షించారు. 600 మంది అభ్యర్థులను పిలవగా 283 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరందరికి ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. 1600 మీటర్ల పరుగు పరీక్షలో 224 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగు పరీక్షలో 165 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. లాంగ్ జంప్‌లో 196 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మొత్తంగా కానిస్టేబుల్ ఫైనల్ పరీక్షకు 3వ రోజు 204 మంది అర్హత సాధించారు. ఏదైనా సమస్యలపై, ఇతర కారణాలతో అప్పీలు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 28న హాజరు కావాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

విజేతలకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల అమలాపురంలో జరిగిన అండర్-14 బాలుర క్రికెట్ టోర్నమెంట్ జిల్లా జట్టు రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచిన సందర్భంగా డిఇఒ శామ్యూల్ పాల్ నేతృత్వంలో క్రికెట్ విజేతలను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా గురువారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాష్ట్రస్థాయిలో కర్నూలు జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన క్రీడాకారులను ప్రశంసించి, పాట్నాలో జరిగే జాతీయస్థాయి క్రికెట్‌కు ఎంపికైన నలుగురు క్రీడాకారులను అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సత్తా చాటి జిల్లా పేరు ఇనుమడింపజేయాలని సూచించారు. డిఇఒ శామ్యూల్ పాల్ కర్నూలు, నంద్యాల జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు గిడ్డయ్య, శ్రీనాథ్‌లను, జట్టు కోచ్ మేనేజర్లుగా వ్యవహరించిన శేఖర్, పాల్ సుధాకర్, రఫీక్, సుబ్రమణ్యంలను ప్రశంసించారు. అనంతరం డిఇఒ కార్యాలయంలో జాతీయ స్థాయి క్రీడాకారులను, కోచ్ మేనేజర్‌లను డిఇఒ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ అసిస్టెంట్ సెక్రటరీలు పరమేష్, సుంకారావు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా
- కలెక్టర్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 2025 నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఉద్యోగులు ప్రజాసంఘాల నాయకులు తదితరులు కలిసి ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తనను కలిసిన అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను ప్రగతి పథంలో నడిపేందుకు జిల్లా అధికారులంతా కష్టపడి పనిచేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాల కనుగుణంగా నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి, సమిష్టిగా నూతనోత్తేజంతో పనిచేద్దామని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యను జిల్లా అధికారులు, రెవిన్యూ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు

వర్గీకరణపై వినతుల స్వీకరణ

- సమగ్ర వివరాలు ఇవ్వాలి
- అధికారులకు ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

షెడ్యూల్ కులాల్లోని ఉప కులాల వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా పలువురు వ్యక్తులు, వివిధ సంస్థల నుంచి వినతులను స్వీకరించారు. గురువారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో షెడ్యూల్ కులాల్లోని ఉప వర్గీకరణ అంశానికి సంబంధించి తొలుత జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఈ అంశంపై వ్యక్తులు, వివిధ సంఘాల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. రంజన్ మిశ్రా మాట్లాడుతూ ఆయా శాఖల వారీగా సమగ్రమైన వివరాలను ఇవ్వాలని మిశ్రా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ ఉప కులాల వారీగా ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా సమగ్రమైన వివరాలను సేకరించి వాటి ఆధారంగా ఏక సభ్య కమిషన్ సిఫార్సులను చేస్తుందని తెలిపారు. ఉప కులాల వారీగా కీలకమైన రంగలైన ఉపాధి, విద్యకు సంబంధించిన ప్రాతినిధ్యంతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య అంశాలకు సంబంధించిన వివరాలను అన్ని ప్రభుత్వ శాఖలు సమగ్రంగా ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. డేటాలో కచ్చితత్వం ఉండాలని, ఎలాంటి పొరపాట్లు ఉండకూడదన్నారు. చాలా జాగ్రత్తతో వివరాలను సేకరించాలని, త్వరితగతిన పంపాలని సూచించారు. అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధి పొందిన వారి వివరాలను కూడా సమగ్రంగా ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయా సంఘాలు, వ్యక్తుల నుండి వచ్చిన దరఖాస్తులను నిర్దేశించిన ప్రొఫార్మాలో పూర్తి వివరాలతో పొందుపరచి పూర్తి స్థాయి విశ్లేషణతో పంపాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్‌ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి తులసీ దేవి, తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

ఎస్సీ వర్గీకరణ కోసం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు వినతులు వెల్లువెత్తాయి. మాలలకు న్యాయం చేయాలని మాల మహనాడు నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని, క్రిమి లేయర్‌ను అమలు చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వర్గీకరణ చేయాలని బిఎస్‌ఎస్ నాయకులు, వర్గీకరణ చేయకూడదని పివి రావు మాలమహానాడు నాయకులు విన్నవించారు. రాజ్యాంగం ద్వారా వర్తించే అన్నీ అందించాలని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు, మాలలకు అన్ని విధాలుగా న్యాయం చేయాలని జాతీయ మాల మహానాడు నాయకులు వినతి పత్రం అందజేశారు. బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో కొనసాగించాలని బహుజన కాంగ్రెస్ పార్టీ, బేడ, బుడగ జంగాల నాయకులు విన్నవించారు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని ఎపి దళిత సమాఖ్య, 59 ఉపకులాల న్యాయవాదులందరికీ న్యాయం చేయాలని మాదిగ లాయర్స్ అసోసియేషన్ నాయకులు, తమను ఎస్సీలుగా గుర్తించాలని మాదాసి కురవ, మాదారి కురవ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

వినతులు స్వీకరిస్తున్న రాజీవ్ రంజన్ మిశ్రా

డిఐజికి ఎస్పీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

నూతన సంవత్సరం సందర్భంగా కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్‌కు ఎస్పీ జి.బిందు మాధవ్ గురువారం శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు రేంజ్ డిఐజి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కర్నూలు కార్పొరేషన్ : నగరపాలక అధికారులు, సిబ్బంది కమిషనర్ ఎస్.రవీంద్ర బాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ నివాసంలో అధికారులు, సిబ్బందితో కలిసి కమిషనర్ కేక్ కట్ చేశారు. మేనేజర్ చిన్నరాముడు, ఎంహెచ్‌ఒ విశ్వేశ్వర్ రెడ్డి, ఆర్‌ఒ ఇజ్రామేలు, సూపరింటెండెంట్లు రామకృష్ణ, వాజీద్ శుభాకాంక్షలు తెలిపారు.

'పేదల పక్షపాతి మన్మోహన్'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేదల పక్షపాతిగా నిలిచాడని డిసిసి అధ్యక్షుడు పి.మురళీకృష్ణ తెలిపారు. గురువారం డిసిసి కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మురళీకష్ణతో పాటు మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, సిటీ అధ్యక్షుడు జిలాని భాష పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు కె.వెంకటరెడ్డి, ఎన్‌సి.బజారన్న, షేక్ రియాజుద్దీన్, ఐఎన్‌టియుసి అధ్యక్షులు బతుకన్న పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - సి బెళగల్

నూతన సంవత్సర యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఏటి తిమ్మన్న, జిల్లా కౌన్సిలర్లు హనుమంతు, కిషోర్, హనుమన్న, ఎంఈఓలు జ్యోతి, ఆడమ్ బాషా గురువారం ఆవిష్కరించారు. యుటిఎఫ్ సమైక్య ఉద్యమాలకు ప్రతి కార్యకర్త పాటు పడాలని వారన్నారు. కాకినాడలో 5, 6, 7, 8న నిర్వహించనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

కూరగాయల మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - మద్దికెర

మద్దికేర మెయిన్ బజార్‌లో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను ఎంపి నాగరాజు, ఎమ్మెల్యే శ్యాంబాబు గురువారం రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూరగాయల వ్యాపారస్తులకు ప్రజలకు నాబార్డు నిధులు, దాతల సహకారంతో అపరిశుభ్రంగా లేకుండా ప్రజలకు ఉపయోగపడేలా కూరగాయల మార్కెట్ నిర్మించారని అన్నారు. మండలంలో నాబార్డు నిధులు మండల అభివృద్ధి పనులు కొరకు ఏదైనా కాంట్రిబ్యూషన్ నిధులు అవసరమైతే తమను సంప్రదించాలని అన్నారు. ప్రజల మౌనిక సౌగపాయాల కల్పనకు, అభివృద్ధి పనులకు ఎల్లప్పుడును అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుహాసిని, ఎంపీపీ అనిత యాదవ్, టిడిపి నాయకులు ధనుంజయుడు, పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్, చంద్రశేఖర్ గౌడ్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ శ్రీనివాసులు, అధికారులు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

- కలెక్టర్, జెసి, పలువురి అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజాశక్తి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను అధికారులు, ప్రముఖులు గురువారం ఆవిష్కరించారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా, జెసి డాక్టర్ బి.నవ్య, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకర శర్మ, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నగరూరు శమంతకమణి, కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు, విష్ణు కన్‌స్ట్రక్షన్స్ అధినేత నగరూరు రాఘవేంద్ర, తదితరులు ఆవిష్కరించారు. ప్రజల పక్షాన కథనాలను ప్రచురిస్తున్న ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా, డెస్క్ ఇంఛార్జి పానుగంటి చంద్రయ్య, స్టాఫ్ రిపోర్టర్ ఎంయు వినయ్ కుమార్, డివిజన్ ఇంఛార్జి ఎం రాజు, సిబ్బంది ఎల్లాగౌడ్, నవీన్, రాకేష్, మధు, విలేకరులు చంద్రమోహన్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు. రాయలసీమ యూనివర్సిటీ ఇన్చార్జి వైస్ ఛాన్సిలర్ ఎన్టికె నాయక్ ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ బి విజయ్ కుమార్ నాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, కో-కన్వినర్ మౌలాలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష, జెసి నవ్య

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నగరూరు శమంతకమణి, కార్పొరేటర్ శ్రీనివాసరావు, రాఘవేంద్ర

ఉస్మానియా పూర్వ విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉస్మానియా కళాశాల పూర్వ విద్యార్థి ఎద్దుల నరేష్ ఎన్ఎస్‌జి బ్లాక్ క్యాట్ కమాండో సర్టిఫికెట్‌ను పొందడంతో ఆయనను గురువారం ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సమీవుద్దీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ అజ్రా జావిద్ పాల్గొని మాట్లాడుతూ దేశానికి ఇలాంటి సైనికుడిని ఇచ్చిన నరేష్ తల్లిదండ్రుల జీవితం ధన్యమని అన్నారు. ఇలాంటి విద్యార్థులను ప్రతి ఒక్క విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కళాశాల ప్లేస్మెంట్ అధికారి, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ప్రారంభించాలి'

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

భవన నిర్మాణ కార్మిక సంఘం న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కల్లూరు సర్కిల్ దగ్గర భవన నిర్మాణ కార్మికుల సభ్యత నమోదు కార్యక్రమం సంఘం నగర నాయకులు చాంద్ బి అధ్యక్షతన నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యత నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి ఆర్. నరసింహులు, నగర అధ్యక్షులు కే.సుధాకరప్ప సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు రెక్క ఆడితే గాని డొక్కాడని స్థితిలో కార్మికుల కుటుంబ పరిస్థితులు ఉన్నాయన్నారు. రంగన్న, ఆంజనేయులు మద్దిలేటి, ఎస్.చాంద్ బీ, కె.అయ్యమ్మ, గిడ్డమ్మ, రామాంజనమ్మ, సుబ్బమ్మ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

ఈనెల 5న జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగే అండర్-19 స్కూల్ గేమ్స్ అథ్లెటిక్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి హర్షవర్ధన్ గురువారం తెలిపారు. బాలురు మహేంద్ర, వినోద్ కుమార్, హిమేష్, రోహిత్ రెడ్డి, పరశురాముడు, వెంకటేష్, శివ వరప్రసాద్, మహేష్ కుమార్ పాల్గొంటారని చెప్పారు. బాలికల విభాగంలో సాయిప్రియ, మహాలక్ష్మి, శ్రీఘ్న, కృష్ణ ప్రియ, అర్చన, సాయి నవ్యశ్రీ పాల్గొంటారని తెలిపారు. జాతీయస్థాయికి ఎన్నికైన క్రీడాకారులను కర్నూలు జిల్లా ఒకేషనల్ అధికారి వై.పరమేశ్వర రెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి హర్షవర్ధన్, కోచ్, మేనేజర్లు నరసింహారాజు, రాము, చామంతి, సుబ్రహ్మణ్యం అభినందించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి - సిఐటియు

ప్రజాశక్తి - మద్దికెర

పారిశుధ్య, మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి బురుజుల రాముడు కోరారు. గురువారం మద్దికెరలో ఎమ్మెల్యే కెఇ.శ్యాం బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అపరిశుభ్రంగా ఉన్న పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికుల జీతాలు సమయానికి అందడం లేదని తెలిపారు. మద్దికెర పంచాయతీలో 20 మందికి పైగా చాలా ఏళ్లుగా పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారని, వారికి పిఎఫ్ అమలు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు కూడా జీతాలు సమయానికి రావడం లేదని చెప్పారు. అధికారులు స్పందించి కార్మికులకు తక్షణమే జీతాలు విడుదల చేయాలని కోరారు. సిపిఎం నాయకులు రవికుమార్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉమ్మడి కర్నూలు జిల్లా డిఎఫ్‌సిఎస్ చైర్మన్ బిఎస్.నవీన్ కుమార్, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ శ్యామలమ్మ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. డిఎఫ్‌సిఎస్ చైర్మన్ నవీన్ కుమార్ మాట్లాడుతూ... మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని తెలిపారు. డిఎఫ్‌సిఎస్ డైరెక్టర్ పోతుల శేఖర్, ఎడి సంధ్యారాణి, ఎఫ్‌డిఒలు మద్దిలేటి, చంద్రయ్య, మల్లికార్జున, ఎఐఎఫ్‌లు నాగరాజు, బాలరాజు, మత్స్యశాఖ సిబ్బంది రాజేష్, రామాంజనేయులు, నాదిర్ పాల్గొన్నారు.

మత్స్య శాఖ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

ఘోర రోడ్డు ప్రమాదం

- దంపతులు మృతి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు మండలం కొత్తూరు గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. బిఎస్‌ఎన్‌ఎల్‌లో పనిచేస్తున్న రామ గోవిందు, ఆయన భార్య కలిసి గురువారం బైక్‌పై కర్నూలు నుంచి కోడుమూరుకు బయల్దేరారు. ఎదురుగా వచ్చిన కారు వేగంగా ఢీకొనడంతో భార్యభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను కోడుమూరుకు తరలించారు.

15న రామిరెడ్డి తాత 32వ ఆరాధన

- ఎమ్మెల్యే గౌరు చరిత దంపతులకు ఆహ్వానం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఈనెల 15న శ్రీఅవధూత రామిరెడ్డి తాత ఆరాధన మహోత్సవానికి హాజరుకావాలని ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులను నిర్వాహకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో సంస్థాన్ అధ్యక్షులు దాసరి రామచంద్రా రెడ్డి, దాసరి సాయిరామ్ రెడ్డి, సంపతి తారకేశ్వర్ రెడ్డి, తూకుంట ప్రతాప్ రెడ్డి, సింగం సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గూడూరు

గూడూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఇఒ సునీలమ్మ, నాగరాజు చేతులమీదుగా యుటిఎఫ్ క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. యుటిఎఫ్ నాయకులు షబ్బీర్, కాంతారావు మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు నారాయణ, కిష్టన్న, శ్రీనివాసులు, రంగారావు, షఫీ, ఖాసీం పాల్గొన్నారు.

ఈగల్ 360 కెమెరా పనితీరు పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పైలెట్ ప్రాజెక్టు కింద నగరంలోని వినాయక్ ఘాట్ దగ్గర ఏర్పాటు చేసిన ఈగల్ 360 కెమెరా పనితీరును గురువారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ ద్వారా పరిశీలించారు. ఈ సర్వేలెన్స్ కెమెరా ద్వారా కెనాల్ లో ఉన్న నీటి ప్రవాహాన్ని గమనించడం, ఆ ప్రాంతంలో ఉన్న వాహనాల రాకపోకలు రికార్డు చేయడం, రోడ్డుపై ఎన్ని వాహనాలు ప్రయాణిస్తున్నాయి అన్న విషయాలు తెలుసుకునే అవకాశముందని తెలిపారు. ఇలాంటి కెమెరాలు మరి కొన్ని చోట్ల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ వెంట కర్నూలు మునిసిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, తదితరులు ఉన్నారు.

క్రీడా మైదానంలో నిర్మాణాలు ఆపాలి

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పెద్దకడుబూరు

పెద్దకడుబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో చేపట్టే నిర్మాణాలను ఆపాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. గురువారం డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి క్రీడా పాలసీ ప్రకటించి జాతీయ క్రీడలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తుంటే కర్నూలు జిల్లా పెద్దకడుబూరులో మాత్రం దీనికి భిన్నంగా అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. గదుల నిర్మాణం పేరుతో విద్యార్థులు ఆడుకునే మైదానం మధ్యలో గుంతలు తవ్వి గదుల నిర్మాణం చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎక్కడా లేనివిధంగా పెద్దకడుబూరులో క్రీడా మైదానం ఉందని, దాన్ని క్రీడ అభివృద్ధికి వినియోగించడం మానేసి స్వలాభం కోసం విద్యార్థులకు అన్యాయం చేయడం సమంజసం కాదన్నారు. గదుల నిర్మాణానికి ఎవరూ వ్యతిరేకం కాదని, కొంతమంది నాయకుల రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థుల భవిష్యత్తు పణంగా పెట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. గదుల నిర్మాణం ఆపాలని కోరారు. ఇప్పటికే రాజకీయ నాయకులు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానాన్ని కబ్జా చేశారని, ఉన్నది కూడా పోతే మండలంలో క్రీడల పరిస్థితి దారుణంగా తయారవుతుందని తెలిపారు. నిర్మాణాలు ఆపక పోతే డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మోషే, డివైఎఫ్ఐ నాయకులు మూర్తి, ప్రభాకర్, విజయ్, సల్మాన్, తలారి రాజు, పవన్, బాబు, సురేంద్ర, సుధాకర్, అర్జున్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమణి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ ఆంజనేయులు

ఈనెల 5, 6, 7, 8న కాకినాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.నాగమణి కోరారు. గురువారం మహాసభల గోడపత్రికను ఎంఇఒ-1 ఎం.ఆంజనేయులు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.రాజు, ఆర్థిక కార్యదర్శి హనీఫ్, ఎల్లప్ప, నాగేష్, నాగరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎద్దుల బలప్రదర్శన పోటీల పండగ

- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా వివిధ పోటీలు పండగ మొదలైందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి స్మారకార్థం నిర్వహించే ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలకు సంబంధించిన గోడపత్రికను ఎమ్మెల్యే బీవీ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ పోటీలు ఈనెల 16 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి పరామర్శించారు. మండలంలోని పరమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ చిన్న తిప్పన్న కుమారుడు బోయ వీరేష్ (36) బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీవీ స్థానిక ప్రభుత్వాస్పత్రికి వెళ్లి బోయ వీరేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి రోడ్డు ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. వీరేష్ కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీవీ

అభివృద్ధికి నోచని 'మజరా'

- గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- సంగాల, కాజీపురం కొట్టాలలో సిసి రోడ్ల నిర్మాణాలకు నోచని వీధులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని మజరా గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ గ్రామాలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నారు. కనీసం సిసి రోడ్ల నిర్మాణాలకు కూడా ఈ గ్రామాలు నోచుకోవడం లేదు.

సంగాలలో శివాలయం పక్కనే ఉన్న మురుగు నీరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లె ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడపాలని ఎంత ప్రయత్నిస్తున్నా కిందిస్థాయిలో ఆ దశగా అడుగులు పడడం లేదు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు జనాభా ఎక్కువ ఉన్న పల్లెటూళ్ల మీదనే దృష్టి పెట్టి అభివృద్ధి పనులు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. చిప్పగిరి మండలంలో మజరా గ్రామాలు కూడా ఉన్నాయని, వాటిని కూడా ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి పనులు చేపడితే బాగుంటుందని మజరా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నేమకల్లు పంచాయతీలోని మజరా గ్రామమైన సంగాలలో వీధుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. వీధుల్లో ఉన్న మురుగునీటిలో నడవలేకపోతున్నామని, ముఖ్యంగా శివాలయం పక్కనే ఉన్న వీధిలో, పైగేరికి పోవు వీధిలో మురుగునీటితో దుర్వాసన వస్తోందని, ఆ వీధుల్లో సిసి రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గుమ్మనూరు పంచాయతీలోని మజరా గ్రామం ఖాజీపురం కొట్టాల, నగరడోనా పంచాయతీలోని మజరా గ్రామం తిమ్మాపురంలోనూ తాగునీటి వసతి, సిసి రోడ్డు వసతి సరిగ్గా లేదు. తిమ్మాపురం గ్రామానికి వెళ్లే అడ్డరోడ్డు కంకర తేలి గుంతలు గుంతలుగా తయారయింది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనులు, తిమ్మాపురం గ్రామానికి వెళ్లే అడ్డరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మజరా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

తిమ్మాపురం అడ్డ రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

- నాగిరెడ్డి, తిమ్మాపురం

రోజూ గ్రామం నుంచి విద్యార్థులు, ప్రజలు రోడ్డుకు నడవాల్సి ఉంది. రోడ్డు అంతా కంకర తేలి ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. మారుమూల గ్రామం కావడంతో ఎలాంటి వాహనాలూ మా గ్రామానికి రావు. నేమకల్లు బస్టాండ్ దిగి గ్రామానికి నడవాల్సిందే. కంకర తేలిన రోడ్డుకు మరమ్మతులు చేపడితే నడవడానికి వీలుగా ఉంటుంది.

చికిత్స పొందుతున్న రైతు

బోరు బావిలో పేలుడు..

- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని చిన్నపెండేకల్లు గ్రామంలో రైతు చంద్ర పొలంలో వేసిన బోరులో పైపులు దింపుతుండగా గురువారం ఒక్కసారిగా పేలుడు సంభవించింది. బోరు బావి పేలుడు సంభవించి ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రైతు చంద్ర, ఆతని భార్య పుష్ప, మరో రైతు జయరాముడుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని స్థానికులు ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- అధికారులు స్పందించండి : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని కుంటనహాల్ గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఒంగి విద్యుత్ తీగలు చాలా కిందికి వేలాడుతున్నాయని, ప్రమాదం పొంచి ఉందని, అధికారులు వెంటనే స్పందించాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం కుంటనహాల్ గ్రామంలో సిద్ధ మల్లయ్య గౌడ్ ఇంటి సమీపంలో విద్యుత్ తీగలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యను గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు మార్చి విద్యుత్ తీగలు పైన ఉండేటట్లు చూడాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యుత్ కార్యాలయం ముందు ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి ఈరన్న, వీరయ్య స్వామి, వన్నూరప్ప పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని సబ్ కార్యాలయ ఆవరణంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యాలయపు పరిపాలన అధికారి కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, రామచంద్ర, లక్ష్మన్న, ఈరన్న, సీనియర్ అసిస్టెంట్ బాబు ఉన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దకడుబూరు

యుటిఎఫ్ నూతన క్యాలెండర్, డైరీ, అధ్యాపక దర్శినిని మోడల్ స్కూల్‌లో ఎంఇఒలు సువర్ణల సునీయం, రామమూర్తి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి.కౌలన్న మాట్లాడుతూ... యుటిఎఫ్ డైరీ, అధ్యాపకదర్శిని ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎన్నో సందేహాలను నివృత్తి చేస్తుందని తెలిపారు. మండల అధ్యక్షులు ప్రశాంత్ భూపాల్ మాట్లాడుతూ... ఈనెల 5, 6, 7, 8న కాకినాడలో జరిగే యుటిఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మండల నాయకులు షేకన్న, మల్లికార్జున, అహ్మద్ హుస్సేన్, అశోక్, నిసార్ బాష, రాజు, విక్టోరియమ్మ, సునీత, విమలమ్మ, హేమ పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఛైర్మన్ల పాత్ర కీలకం

- ఎంఇఒలు సుదర్శన్ రెడ్డి, రఘునాథ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ

ప్రజాశక్తి నందవరం

పాఠశాలల అభివృద్ధిలో విద్యాకమిటీ ఛైర్మన్ల పాత్ర కీలకమైందని ఎంఇఒలు సుదర్శన్ రెడ్డి, రఘునాథ్ తెలిపారు. గురువారం నందవరం జిల్లా పరిషత్ పాఠశాలలో మండలంలో గల వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాల అభివృద్ధిలో విద్యా కమిటీ ఛైర్మన్ భాగస్వాములు కావాలన్నారు. పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ, బడి బయట గల పిల్లలను పాఠశాలలో చేర్పించడం బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. వారంలో రెండుసార్లు అయినా పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలని చెప్పారు. ప్రతినెలా పాఠశాలలో యాజమాన్య కమిటీ సమావేశం జరిగేలా చూడాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించేలా చూడాలన్నారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. వంట చేసే విషయంలో వంట సిబ్బంది పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యా కమిటీ ఛైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు బాధ్యతాయతంగా వ్యవహరిస్తే పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య, సాయిబాబా తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో వెనుకబడిన మంత్రాలయంలో విద్యాభివృద్ధి జరిగినప్పుడే నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థుల కోసం సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ గది, క్రీడా మైదానం అభివృద్ధి కోసం రూ.45 లక్షలు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. నియోజకవర్గంలో వలసలను నివారించడానికి ఒకవైపు విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ మరోవైపు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. విద్యాభివృద్ధి కోసం వివిధ పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడం, వ్యవసాయం కోసం రైతులకు సాగునీరందిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. వీటి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. బిజెపి ఇన్‌ఛార్జీ విష్ణువర్ధన్ రెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, సురేష్ నాయుడు, వెంకటపతి రాజు, అడివప్ప గౌడ్, కురువ వీరేష్, సౌద్రి బసవరాజు, నీలకంఠ రెడ్డి, గిరి, ముక్కన్న, జనసేన నాయకులు రామాంజి, ఎంపిడిఒ సుబ్బరాజు, శంకర్, సర్పంచి పాల్ దినకరన్, ప్రధానోపాధ్యాయులు ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

'ఉపాధి' శాతం పెరగాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 16 గ్రామాల్లోనూ ఉపాధి పనులు చేసుకునే వారి శాతం పెరగాలని ఎంపిడిఒ అల్లా బకాష్ ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. గురువారం మండల కార్యాలయంలో ఎపిఒ జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వలసలు వెళ్లకుండా పనులు కల్పించే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వేతనాలు సకాలంలో అందుతున్నందున ఉపాధి కూలీలకు సరైన అవగాహన కల్పిస్తూ పనులకు వెళ్లేలా కృషి చేయాలన్నారు. మినీ గోకులం షెడ్లు నిర్మించుకునే వారందరూ త్వరగా పూర్తి చేసుకుంటే లబ్ధిదారులకు సకాలంలో నిధులు మంజూరయ్యేలా చూడాలని ఎపిఒకు సూచించారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

భూసమస్యలు పరిష్కారం

- తహశీల్దార్ శివశంకర్ నాయక్

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సుల ద్వారా రైతు భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహశీల్దార్ శివశంకర్ నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని శంకరబండ గ్రామ సచివాలయంలో విఆర్ఒ మాబు సుభాన్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుకు మంచి స్పందన వస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఇన్‌ఛార్జీ ఆర్ఐ రంగస్వామి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, సర్పంచి విజయలక్ష్మి, వైసిపి మండల కో కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, టిడిపి నాయకులు ముత్యాల రెడ్డి, నాగేంద్ర, సిబ్బంది హరి బాబు పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ కుమారస్వామి మాట్లాడుతూ... రైతులు భూ సమస్యలను అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. **హోళగుంద** మండలంలోని ముద్దటమాగి గ్రామంలో విఆర్ఒ సురాంజనేయులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ కె.సతీష్ పాల్గొన్నారు.

ఆస్పరిలో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ శివ శంకర్ నాయక్

గోనెగండ్లలో వినతులను స్వీకరిస్తున్న తహశీల్దార్

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం ఉధృతం : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆస్పరి

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని ఎస్‌టియు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేంద్రప్ప తెలిపారు. గురువారం ఆస్పరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌టియు నూతన సంవత్సర డైరీలు రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప, ఎంఇఒ-2 తిరుమల రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎస్‌టియు రాష్ట్ర నాయకులు నాగరాజు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజిని, మురళీ కృష్ణ, సీనియర్ నాయకులు కాశీ విశ్వనాథ శాస్త్రి, జ్యోతి మూర్తి, లక్ష్మీపతి, బసవరాజు, శ్రీరంగ, ఉరుకుంద, లక్ష్మీనారాయణ, వినోద్ కుమార్, తులసయ్య, జ్యోతి లక్ష్మి, శోభారాణి పాల్గొన్నారు.

డిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని హెచ్.కైరవాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మహబూబ్ బాషా, డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్పలు డిటిఎఫ్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొత్త సంవత్సరంలోనైనా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించారు. జిఒ 117ను రద్దు చేసి, పాతవిధానంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కొనసాగాలని కోరారు. ఉపాధ్యాయులకు భారంగా ఉన్న యాపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని కోరారు. 10వ తరగతి వరకు సమాంతర మాధ్యమాన్ని కొనసాగించాలని తెలిపారు. పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని బలోపేతం చేయాలని కోరారు. పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు, హెల్పర్లకు, వాచ్‌మేన్‌లకు ప్రతినెలా జీతాలు చెల్లించాలని తెలిపారు.

పట్టణ సుందరీకరణకు ప్రణాళికలు

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణ సుందరీకరణకు ప్రణాళిక సిద్ధం చేశామని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని శ్రీనివాస సర్కిల్ దగ్గర నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు డివైడర్ పనులను పరిశీలించారు. ఈ పనులు శ్రీనీలకంఠేశ్వర జాతరలోపు పూర్తి చేస్తామన్నారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు.

పంచాయతీల్లో మొదటి గ్రామ సభ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండలం గోనెగండ్ల మేజర్, పెద్దనేలటూరు, అల్వాలతో పాటు అన్ని పంచాయతీల్లోనూ 2025 సంవత్సరంలో గురువారం మొదటి గ్రామ సభ నిర్వహించినట్లు ఇఒఆర్‌డి అనంతశయన, పంచాయతీ కార్యదర్శులు సతీష్ కుమార్, టి.వెంకటేష్ తెలిపారు. ఈ గ్రామసభలో 2025-26వ ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు, గత మూడు నెలల్లో జరిగిన ప్రగతి, ముందు జరిగే పనులకు అనుమతి కోరడం, గ్రామసభలు, పన్నుల వసూళ్ల గురించి వివరించి చర్చించినట్లు వారు తెలిపారు. **హోళగుంద** పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. మేజర్ పంచాయతీ సర్పంచి చలువాది రంగమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, టిడిపి కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎఇ ఎస్.ప్రసాద్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిదానంద, వార్డు సభ్యులు హమీద్, సుభాన్, చిన్న మల్లయ్య, మల్లప్ప, బాషా, వైస్ ఎంపిపి హనుమప్ప పాల్గొన్నారు.

గోనెగండ్లలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

విద్యార్థినిపై లైబ్రేరియన్ లైంగిక వేధింపులు

- విద్యార్థినులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హైవే దిగ్బంధం
- విద్యార్థినులతో మాట్లాడిన ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని బనవాసి ఎపిఆర్‌జెసి బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినిపై లైబ్రేరియన్ మద్దిలేటి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని విద్యార్థి సంఘాల జెఎసి నాయకులు విమర్శించారు. గురువారం జెఎసి ఆధ్వర్యంలో జాతీయ రహదారిని దిగ్బంధించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, విద్యార్థి సంఘాల నాయకులు వీరేష్ యాదవ్, మహేంద్ర, రాజేష్ మాట్లాడారు. లైబ్రేరియన్‌ను విధుల నుంచి తొలగించాలని, విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కూతురు వయస్సున్న అమ్మాయిల ను 'రావే.. పోవే' అంటూ అసభ్య పదజాలంతో సంబోధిస్తున్నాడని, వికృత చేష్టలకు పాల్పడుతున్న లైబ్రేరియన్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. లైబ్రేరియన్‌ను ప్రిన్సిపల్ వెనుకేసుకు రావడం దుర్మార్గమని విమర్శించారు. కళాశాలలో విద్యార్థినులను సెంట్రల్ జైలులో ఖైదీల కంటే హీనంగా చూస్తున్నారని తెలిపారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ఉంటే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

నిరసన చేపడుతున్న విద్యార్థినులు, సంఘాల నాయకులు

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎపిటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని ఆదోని డిప్యూటీ డిఇఒ వెంకట రమణారెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఎంఇఒలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు మాట్లాడుతూ... విద్యాభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయులే కీలకమని, విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని తెలిపారు. విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని, ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెరగాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు రఘురామయ్య, జిల్లా అధ్యక్షులు నాగరాజు, విశ్రాంత ఎంఇఒ శివరాములు, మండల అధ్యక్షులు ముత్తన్న, ఉపాధ్యాయులు మల్లికార్జున, తిక్కస్వామి, భీమారెడ్డి, హనుమంతు రెడ్డి, సంగమేష్, అశ్వర్థప్ప, సిద్ధలింగ, రామాంజనేయులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ కాలువలను మూసేస్తే ఎలా

- శానిటేషన్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - ఆదోని

మురుగు కాలువలపై కట్టడాలు నిర్మించడం వల్ల వ్యర్థాలు తొలగించేందుకు ఇబ్బందిగా ఉందని, సహకరించాల్సింది పోయి సిమెంటు కాంక్రీట్‌తో మూసివేయడం భావ్యమా అంటూ మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అభ్యంతరం తెలిపారు. గురువారం ఆదోనిలోని ఎస్‌కెడి కాలనీ 3వ రోడ్డు బాలాజీ అపార్ట్‌మెంట్ సమీపంలో ఇంటి ముందు మురుగు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మురుగు కాలువను మూసి వేయడం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వచ్చే అవకాశం ఉందన్నారు. కాలువలను తెరిచి ఉంచాలని అవగాహన కల్పిస్తున్నా కొందరు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఇంటి ఆవరణమంతా కాలువను మూసివేస్తే మురుగు ఎలా బయటకు వచ్చేది అంటూ నిలదీశారు. కాలువపై ఓపెన్‌గా ఉంచాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేస్తామన్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఇప్పటికే రోడ్లపై నీరు నిలుస్తోందని, ఇలా కాలువలు మూసివేస్తే ఎలా అంటూ అభ్యంతరం తెలిపారు. ఇంటి ఓనర్ చెప్పడం వల్ల ఇంటి ముందు పని చేస్తున్నామని పని వారు చెప్పారు.

అభ్యంతరం తెలుపుతున్న మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోండి : ఎస్‌టియు

ప్రజాశక్తి - కౌతాళం

ఎస్‌టియు రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌టియు జిల్లా కార్యదర్శి రామచంద్ర కోరారు. గురువారం హాల్వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సారథి శర్మ చేతులమీదుగా స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పేద విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి దోహదపడుతుందన్నారు. కేవలం రూ.35లకే లభిస్తుందన్నారు. విద్యార్థులు ఈ పుస్తకాన్ని చదివి మంచి ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్‌టియు నాయకులు తిమ్మన్న, తిక్కన్న, నాగమద్దయ్య, రంగస్వామి, భగీరథి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ప్రధానోపాధ్యాయులు

గడినాడ కన్నడిగులకు న్యాయం చేయండి

- ప్రధానోపాధ్యాయులు మూకప్ప

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గడినాడు కన్నడిగుల సరిహద్దు ప్రాంతాల్లో కన్నడ మాట్లాడే ప్రజలు, విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ప్రధానోపాధ్యాయులు టి.మూకప్ప కోరారు. గురువారం మండలంలోని పెద్ద హరివాణం గ్రామంలో మండల పరిషత్ కన్నడ ప్రాథమిక పాఠశాల శ్రీగూళ్యం హిరేమఠ కుమారస్వామి కన్నడ సేవా సమితి ఆధ్వర్యంలో శాలెగొందు కన్నడ కార్యక్రమాన్ని వై.ముత్తన్న, సేవా సమితి అధ్యక్షులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గ్రామ పెద్దలు ఆదినారాయణ, నాటక రంగం కళాకారులు బదనేహాళ్ భీమన్న, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మోనయ్య హాజరయి మాట్లాడారు. గడినాడ కన్నడిగులకు ఆంధ్ర, కర్ణాటక ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని, 2020 నుంచి కర్ణాటక అధికారులు గుర్తించి అభినందించి అవార్డులు ఇచ్చారని, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు అన్ని రకాల పరిశీలన చేసి అన్ని శాఖల్లో ఉద్యోగాలు వచ్చేలా న్యాయం చేయాలని కోరారు. కన్నడ సేవా సమితి కార్యదర్శులు గిడ్డయ్య, గూళ్యం హిరేమఠ కుమారస్వామి, హైస్కూల్ కన్నడ పండితులు శివకుమార గౌడ, పాఠశాల ఉపాధ్యాయులు జీవిత, అన్నపూర్ణ, సరస్వతి, నిర్మల, హులుగప్ప, అశ్వర్థప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

NACME CHANGE

I, GADIWAN ABDUL FEROZ (Old Name) S/o.GADIWAN SUBHAN R/o. H.No:1/203/53, 2nd NGO's Colony, Opp:SMB Function Hall, Adoni, Kurnool dist, AP.,I changed my name as GADIWAN FEROZ Henceforth I will be known as GADIWAN FEROZ

మహారాజ శ్రీ కర్నూలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం.543/2024 ఇన్ ఓ.యస్.నెం.727/2014

ఉయ్యాలవాడ కాశీంసాహెబ్ మరియు ఒకరు

...అర్జీదార్లు/వాదులు

-వర్సెస్-

1. ఉయ్యాలవాడ బకార్‌బీ (డైడ్)
2. ఉయ్యాలవాడ మధార్‌సా(డైడ్)

వీరి వారసులు వగైరా. ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

15వ రెస్పాండెంటు/ప్రతివాదికి నోటీసులు

(15). శ్రీమతి ఉయ్యాలవాడ ఆశాబీ భర్త మాబు అలీయాస్ మాబు సాహెబ్, గృహిణి, వయస్సు 38 సంవత్సరాలు, నివాసం.కాల్వ గ్రామము, ఓర్వకల్లు మండల, కర్నూలు జిల్లా.

పైనెంబరు దావాలో వాదులు, రెస్పాండెంట్లు/ ప్రతివాదులు అయిన మీ మీద దావాలో కనబరచిన షెడ్యూలు ఆస్తులలో భాగపరిష్కరం చేయమని దావా దాఖలు చేసినారు. అలాగే 15 రెస్పాండెంటును దావా చేర్చమని అర్జీదారులు అర్జీ దాఖలు చేసినారు. ఇందులో 15 రెస్పాండెంటు/ ప్రతివాది మీకు కోర్టు నుండి పలుమార్లు సమన్లు పంపినను మీకు చేరనందున కోర్టువారు ఈ పత్రిక ద్వారా సమన్లు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున 15 రెస్పాండెంటు/ ప్రతివాది అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 07-1-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా :07-1-2025

యస్.యం.డి.హనీఫ్,

అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు.